క్లుప్తంగా

గంగపెట్టెకు పాలపొంగళ్లు



అచ్చమాంబ ఆలయం వద్ద గంగపెట్టెకు విశేష పూజలు నిర్వహించిన భక్తులు

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మండలంలోని పొంగూరుమాలిచేలో కొలువైన అచ్చమాంబ పేరంటాళ్ల తల్లికి శుక్రవారం ఆలయ అర్చకుడు పాశర్లపూడి వెంకటేశ్వర్లుశర్మ విశేష పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా పొంగూరు నుంచి వంశ పారంపర్య ధర్మకర్తల ఆధ్వర్యంలో గంగపెట్టెను ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకొచ్చి కొలుపు నిర్వహించారు. అమ్మవారి భక్తులు వీరతాళ్లతో శివాలు ఎత్తారు. అనంతరం పాల పొంగళ్లు పెట్టి దీపారాధన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

సమగ్రంగా భూముల రీసర్వే



లక్ష్మీపురంలో రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీరామకృష్ణ

కలిగిరి: గ్రామాల్లో జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్షణ పథకం ద్వారా సమగ్రంగా భూముల రీసర్వే జరుగుతుందని తహసీల్దార్ శ్రీరామకృష్ణ తెలిపారు. పరికోట, లక్ష్మీపురం గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చే సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో భూముల రీసర్వే జరిగే సమయంలో రైతులు దగ్గర ఉండి తమ భూములకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను చూపి సర్వే సక్రమంగా చేయించుకోవాలని సూచించారు. వీఆర్వో సుబ్బయ్య, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వెలిగండ్లలో రెవెన్యూ సదస్సు

కొండాపురం: మండలంలోని వెలిగండ్ల సచివాలయంలో తహసీల్దార్ హుస్సేన్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆరు అర్జీలు రాగా అందులో మూడు అర్జీలకు అక్కడికక్కడే పరిష్కరించారు. మరో మూడు అర్జీలను త్వరలో పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ కోటేశ్వరరావు, వీఆర్వో సిద్ధారెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన శిక్షణ



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చేజర్ల: మండలంలోని చేజర్ల, చిత్తలూరు పీహెచ్‌సీల్లో ఏఎన్‌ఎంలు, ఆశలకు కుష్టువ్యాధిపై శుక్రవారం వైద్యులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్యులు ప్రమీలారాజ కుమారి మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి జూలై 16వ తేదీ వరకు కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపులో భాగంగా ఇంటింటికి సర్వే చేయాలన్నారు. ప్రతి ఒక్కరి చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు కాని, పొడలు ఉన్నట్లు అయితే వాటిని సర్వే ద్వారా రిపోర్టు చేయాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నవీన్‌కుమార్‌రెడ్డి, సీహెచ్‌ఓ చంద్రయ్య, సూపర్‌వైజర్లు సత్యవతి, సుప్రజ హాజరయ్యారు.

మానసాదేవి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేకాలంకరణలో మానసాదేవి అమ్మవారు

వరికుంటపాడు: మండలంలోని తూర్పురొంపిదొడ్లలో కొలువైన ఉన్న మానసాదేవి అమ్మవారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. చల్లా వంశస్తులు నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలు మూడు రోజుల పాటు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో అన్నదానంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

తల్లిదండ్రులు, బంధుమిత్రులు రక్తదానం

కావలి: పట్టణానికి చెందిన ఇంటూరి సాయి సాకేతన్ మూడో వర్ధంతిని పురస్కరించుకుని తల్లిదండ్రులు, బంధుమిత్రులు శుక్రవారం రక్తదానం నిర్వహించారు. పట్టణంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రంలో సాయి సాకేతన్ తల్లిదండ్రులు ఇంటూరి నాగేశ్వరరావు, లక్ష్మితో పాటు బంధుమిత్రులు, ఇతర కుటుంబ సభ్యులు రక్తదానం చేశారు. సాయిసాకేతన్ తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడి జ్ఞాపకార్థం మూడేళ్లుగా రక్తదానం చేస్తున్నట్లు తెలిపారు.

మున్సిపాలిటీ నిర్లక్ష్యం.. తాగునీటికి కష్టం

- దండిగా నిధులు ఉన్నా.. నిర్వహణ లోపం
- పాతపైప్‌లైన్‌కు తరచూ మరమ్మతులు
- తాగునీటికి ఇబ్బంది పడుతున్న ప్రజలు

కావలి: జిల్లాలో గ్రేడ్-1 మున్సిపాలిటీ కావలి. రాబడి దండిగా ఉంటుంది. నిధులు పుష్కలంగా ఉన్నాయి. అయితే మున్సిపాలిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పట్టణంలో తరచూ తాగునీటికి కష్టం ఏర్పడుతోంది. ఎప్పుడో పాతికేళ్ల క్రితం ఏర్పాటు చేసిన పైప్‌లైన్‌కు అక్కడక్కడ దెబ్బతినడంతో మరమ్మతుల పేరుతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. మున్సిపాలిటీకి ఎన్నికలు జరగకపోవడంతో పాలకవర్గం లేకుండా పోయింది. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా ఇంజినీరింగ్ విభాగం అధికారుల్లో అలవికాని నిర్లక్ష్యం నెలకొంది.

కావలి పట్టణానికి తాగునీటిని అందించడానికి పట్టణానికి పశ్చిమ ప్రాంతం ఉదయగిరి నియోజకవర్గంలోని జలదంకి మండలం జమ్మలపాళెం శివారులో 1999లో సమ్మర్ స్టోరేజీకి శ్రీకారం చుట్టారు. అయితే అప్పటి టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందిన ఓ బినామీ కాంట్రాక్ట్ వర్క్‌ను చేజిక్కించుకుని సమ్మర్ స్టోరేజీ నుంచి సుమారు 7 కి.మీ. పొడవున 2 అడుగుల వ్యాసార్థంలో ప్రధాన పైప్‌లైన్‌ను ఉదయగిరి బ్రిడ్జి సెంటర్ వరకు భూమిలో ఏర్పాటు చేశారు. ఇది తాగునీటి పైప్‌లైన్ జంక్షన్‌గా ఇక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు పైప్‌లైన్ వేసి తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే మార్గం మధ్యలో రైల్వే ట్రాక్ ఉండడంతో రైల్వే ఇంజినీర్లు రంగంలోకి దిగి, తమ సూచనల మేరకే రైలు ట్రాక్ కింద పైప్‌లైన్ నిర్మించుకోవడానికి అనుమతులు ఇస్తామని తెగేసి చెప్పారు. ఈ నేపథ్యంలో రైల్వే ఇంజినీర్ల సిఫార్సు మేరకు రైల్వే ట్రాక్ వరకు ఐరన్ పైప్‌లైన్‌ను నిర్మించారు. మిగిలిన చోట ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వంటి మెటల్‌తో పైప్‌లైన్‌ను నిర్మించారు. ఒక్క రైల్వేట్రాక్ దగ్గర మినహా, మిగిలిన ప్రాంతంలో పైప్‌లైన్ తరచూ దెబ్బతింటుంది. పైప్‌లైన్ నిర్మాణంలో కనీస ప్రామాణికాలు పాటించలేదని అప్పట్లోనే ఆరోపణలు వచ్చాయి. ఈ పేరుతో అప్పటి నుంచి ఇప్పటి వరకు మున్సిపాలిటీ నిధులు కర్పూరం హారతిలా కరిగిపోతూనే ఉన్నాయి. దీంతో పాటు పట్టణ ప్రజలకు మున్సిపాలిటీ తాగునీటి సరఫరాను రోజుల తరబడి నిలిపేస్తోంది. ఆ నాటి నుంచి నేటి కావలి పట్టణ ప్రజలు తాగునీటి కష్టాలు పడుతూనే ఉన్నారు. మరమ్మతుల పేరుతో భారీగా నిధులు ఖర్చు చూపిస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు పైప్‌లైన్‌ను మార్చి కొత్తది వేయాలనే ఆలోచనే చేయకపోవడం కొసమెరుపు. ఇటీవల కావలి–కడప రోడ్డులో రెండు చోట్ల పైప్‌లైన్ దెబ్బతినింది. దీంతో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



పైప్‌లైన్ మరమ్మతులతో కావలి-కడప జాతీయ రహదారి బ్లాక్
(ఇన్‌సెట్) కావలి-కడప జాతీయ రహదారిపై నీటి పైప్‌కు జరుగుతున్న మరమ్మతులు



ట్రంక్‌రోడ్డు నుంచి రైల్వేస్టేషన్‌కు చేరుకునే రోడ్డులో బ్లాక్ చేసిన దృశ్యం
(ఇన్‌సెట్) ఉదయగిరి రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డులో పైప్‌లైన్‌కు మరమ్మతులు

పైప్‌లైన్ మార్చే ప్రతిపాదనలు ఉన్నాయి

ఈ పైప్‌లైన్‌ను తొలిగించి, పటిష్టమైన జాగ్రత్తలతో కూడిన పైప్‌లైన్ నిర్మించాలనే ప్రతిపాదనలు ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నాం. అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపిస్తాం.
– శ్రీనివాసులురెడ్డి, ఏఈ, కావలి మున్సిపాలిటీ

పేదలను బాగు పరచడమే ప్రభుత్వ లక్ష్యం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

- హైలెవల్ కెనాల్ నిర్మాణ పనులు త్వరలో పూర్తి
- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

చేజర్ల: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద ప్రజలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి పథంలో నిలబెట్టడమే లక్ష్యంగా రూ.2.10 లక్షల కోట్లు ప్రజలకు నేరుగా అందించారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చేజర్ల మండలం పాతపాడు సచివాలయం పరిధిలో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదట గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు, మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ పథకాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొందరు రోడ్లు, కొందరు తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డులు, సామాజిక పింఛన్ల విషయంలో సచివాలయ సిబ్బంది త్వరగా వారి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారనే విషయం ప్రతి గడపకు వెళ్లినప్పుడు వారి మాటల్లో తెలుస్తుందన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలు మాత్రమే కాదు, సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు. యువగళం యాత్ర నిర్వహిస్తున్న లోకేశ్ గ్రామీణ ప్రాంతాల్లో కాకుండా ప్రధాన గ్రామాల్లో నిర్వహిస్తే బాగుండేదన్నారు. రాష్ట్రంలో ఆత్మకూరు నియోజకవర్గంలో అభివృద్ధి ఎవరి హయాంలో జరిగిందో ప్రజలే లోకేశ్‌కు వివరిస్తున్నారన్నారు. ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలకు సాగు, తాగునీటిని అందించేందుకు నిర్మిస్తున్న ఆనం సంజీవరెడ్డి హైలెవల్ కెనాల్ పనులు మా ప్రభుత్వంలోనే పూర్తి చేస్తామని, ప్రజలకు జగనన్న మాటపై నమ్మకం ఉందన్నారు. టీడీపీ ఫేజ్–1 మేనిఫెస్టో లోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న పథకాలు ఇన్ని ఉంటే.. ఎన్నికల ముందు ప్రకటించే మేనిఫెస్టోలో మా జగనన్న సంక్షేమ పథకాలే ఉంటాయని ప్రజలే అంటున్నారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలపై ప్రజలకు విశ్వాసం, నమ్మకం ఉందని, వారంతా మరొకసారి ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని, మేమంతా ఆయనకు తోడుగా నిలుస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, తహసీల్దార్ శివకృష్ణయ్య, ఎంపీడీఓ ఎస్.కరిముల్లా, పాతపాడు సర్పంచ్‌లు ఏ స్రవంతి, ఎంపీటీసీ జి ప్రభావతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలిరెడ్డి సుధాకర్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు ఏ చిరంజీవిరెడ్డి, బొర్రా మస్తాన్‌రెడ్డి, కాకుమూరి వెంకటరెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, రవీంద్ర నాయుడు, సుందరరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్షను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పలు సంక్షేమ పథకాలను అర్హులైన లబ్ధిదారులు అందరికీ నూరు శాతం అందించేలా అధికారులు అన్ని స్థాయిల్లోనూ అంకిత భావంతో పనిచేసి జయప్రదం చేయాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సంక్షేమ, విద్యా సహాయకులు, డిజిటల్ అసిస్టెంట్లకు జగనన్న సురక్షా కార్యక్రమంపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23 నుంచి జూలై 23వ తేదీ వరకు ఎంపీడీఓ, తహసీల్దారు బృందాలుగా ఏర్పడి నిర్ణయించిన తేదీల్లో గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. గ్రామాల్లో నిర్వహించే సమావేశాలకు అర్హులైన లబ్ధిదారులకు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ముందుగానే తెలిపి వారికి రావాల్సిన పథకాలకు సంబంధించి అవగాహన కల్పించాలన్నారు. రైతులకు, విద్యార్థులకు, మహిళలకు అవసరమైన సర్టిఫికెట్లు, భూములకు సంబంధించిన పత్రాలు, తదితర సమస్యలపై వినతులు స్వీకరించి అక్కడికక్కడే ఆయా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుడతారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ ఉషారాణి, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్‌లు, సంక్షేమ, విద్యా సహాయకులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ విశేష కృషి

- లోకేశ్.. నాడు– నేడు బడులను చూడయ్యా
- వైఎస్సార్‌సీపీ నాయకులు



మాట్లాడుతున్న ఆత్మకూరు వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల ముందు నో అడ్మిషన్ బోర్డులు కనిపిస్తున్నాయి. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకురావడంతో కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా ఉన్నాయి. లోకేశ్.. ఒకసారి నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేసిన పాఠశాలను చూడయ్యా' అని పలువురు వైఎస్సార్‌సీపీ నేతలు సూచించారు. ఆత్మకూరులోని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తూ నాడు–నేడు పథకం ద్వారా అభివృద్ధి చేస్తున్నారన్నారు. గతంలో ప్రభుత్వ వైద్యశాలలు అంటే ప్రజలు భయపడే స్థితిలో ఉండేవారని, ఇప్పుడు కార్పొరేట్ వైద్యం కంటే ప్రభుత్వ వైద్యశాలల్లోనే వైద్యం చేయించుకుంటున్నారన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికి అందుతున్నాయా లేదా అనే ఉద్దేశంతో ఎమ్మెల్యేలను, ప్రభుత్వ అధికారులకు ప్రతి ఒక్కరిని గడప గడపకు వెళ్లి తెలుసుకుని సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను అప్పటికప్పుడే అధికారులతో చర్చించి పరిష్కార మార్గాలను చూపుతున్నారన్నారు. దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి ఉన్న సమయంలోనే ఆత్మకూరు మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం కోసం సీఎస్ఆర్ నిధుల ద్వారా ఏర్పాటు చేయాలని భావించారని, ఆ నిధులు వచ్చేలోగా గౌతమ్‌రెడ్డి మరణించడంతో ఆయన సోదరుడు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆ బాధ్యతలు తీసుకుని తమ సొంత నిధులతో మున్సిపల్ బస్టాండ్ నిర్మాణం ప్రారంభి పూర్తి చేశారన్నారు. గతంలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను కొనసాగిస్తూ ఈ నెల 24న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి, నియోజకవర్గంలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో ప్రజలే గెలిపిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్, సీహెచ్ ఆదిశేషయ్య, సొసైటీ అధ్యక్షుడు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, కొండా వెంకటేశ్వర్లు, నోటి వినయ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

ఆధార్ యాక్టివేషన్ చేసుకోవాలి

చేజర్ల: వైఎస్సార్ రైతు భరోసా సాయం పడని రైతులు తమ ఆధార్ కార్డును యాక్టివేషన్ చేయించుకోవాలని ఏఓ శిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 79 మంది రైతులకు ఆధార్ యాక్టివ్ లేనందున ఎన్‌పీసీఐ లింక్ లేనందున రైతు భరోసా నిధులు జమ కాలేదని తెలిపారు. అటువంటి రైతులు ఆధార్‌ను యాక్టివేషన్ చేయించుకుని ఎన్‌పీసీఐ లింక్ చేసుకుంటే త్వరలో డబ్బు జమ అవుతాయని తెలిపారు. 50 శాతం సబ్సిడీతో పచ్చిరొట్ట విత్తనాలు ఉన్నాయని తెలిపారు. పీఎం కిసాన్ ఈకేవైసీ చేసుకోని రైతులు తప్పని సరిగా వారం రోజుల లోగా ఈకేవైసీ చేసుకోవాలని తెలిపారు. ఈకేవైసీ కోసం రైతు భరోసా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని కోరారు.

23 నుంచి జగనన్న సురక్ష పథకంపై అవగాహన

కొండాపురం: జగనన్న సురక్ష పథకంపై శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బ్రహ్మయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23 నుంచి వచ్చే నెల 18వ తేదీ వరకు ప్రతి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. దీంతో సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలని కోరారు.

20న స్పోర్ట్స్ ప్రవేశ దారుఢ్య పరీక్షలు

వింజమూరు (ఉదయగిరి): కడపలోని డాక్టర్ వైఎస్సార్ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్లో 4, 5 తరగతుల్లో చదువుకునేందుకు ఈ నెల 20న వింజమూరులో మండల స్థాయి శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయిప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉదయం 9 గంటలకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని చెప్పారు. ఆసక్తి ఉన్న బాలబాలికలకు ఎత్తు, బరువు, 800 మీటర్ల పరుగు పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. స్పోర్ట్స్‌పై ఆసక్తి ఉన్న విద్యార్థినీ విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉపాధి హామీ పనుల తనిఖీ

బిట్రగుంట: మండలంలోని బోగోలు, ఉమామహేశ్వరపురం పంచాయతీల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్ మహేష్ శుక్రవారం తనిఖీ చేశారు. తొలుత బోగోలు పంచాయతీలో ఉపాధి హామీ పథకం పనులతో పాటు మస్టర్ రోల్ నిర్వహణ, గతంలో కూలీలకు చెల్లించిన కూలీ వివరాలు తదితర అంశాలు పరిశీలించి ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. అనంతరం ఉమామహేశ్వరపురంలో జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. మస్టర్ రికార్డులు, మేట్‌ల హాజరుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆయన వెంట ఏపీఓ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వింజమూరు (ఉదయగిరి): మండలంలో ఖాళీగా ఉన్న వలంటీరు పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారికి 19, 20 తేదీల్లో మౌఖిక పరీక్ష నిర్వహించి ఎంపిక చేస్తామని ఇన్‌చార్జి ఎంపీడీఓ సాయిప్రసాద్ తెలిపారు. ఊటుకూరులో 2, చాకలికొండలో 1, బుక్కాపురంలో 1 వలంటీరు పోస్టు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.

మొక్కుబడిగా సామాజిక తనిఖీ ప్రజావేదిక

- రూ.71,195 రికవరీ తేల్చిన అధికారులు



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక నిర్వహిస్తున్న అధికారులు

జలదంకి: ఉపాధి పనులపై సామాజిక తనిఖీ బృందం నిగ్గు తేల్చిన అవినీతి, అక్రమాలపై జలదంకి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం జరిగిన 15వ విడత సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదిక మొక్కుబడిగా సాగింది. 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31వ తేదీ వరకు మండలంలోని 17 పంచాయతీల్లో రూ.8.83 కోట్ల నిధులతో జరిగిన 897 పనులకు సంబంధించి పది రోజులుగా విలేజ్ సోషల్ ఆడిటర్స్ గ్రామాల్లో తనిఖీలు చేపట్టారు. వీరు చేపట్టిన తనిఖీపై జిల్లా అడిషనల్ పీడీ నిర్మలారెడ్డి, క్లస్టర్ ఏపీడీ గాయత్రిదేవి, జిల్లా విజిలెన్స్ అధికారి సురేష్ సామాజిక తనిఖీ బహిరంగ వేదికలో పనులపై విచారణ చేపట్టారు. ప్రతి పంచాయతీకి సంబంధించి పనులను చదువుకుంటూ పోవడం కనిపించింది. ఎన్ఆర్ఈజీఎస్ పనుల్లో అవకతవకలకు రూ.7,353 జరిమానా విధించగా, నిధులు పక్కదారి పట్టించడంపై రూ.8,035 రికవరీ ఆదేశించారు. సమగ్ర సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) పనులకు సంబంధించి రూ.55,807 రికవరీకి సిఫార్సు చేశారు. అయితే ఏడాది కాలంలో రూ.8.83 కోట్ల మేర జరిగిన పనుల్లో కేవలం రూ.71,195 మొత్తం మాత్రమే పక్కదారి పట్టినట్లు తేల్చారు. అన్ని పంచాయతీల్లో మస్టర్లు సక్రమంగా లేకపోవడం, పనుల వివరాలు ఎంబుక్‌ల్లో నమోదు చేయకపోవడం తదితరాలపై అధికారులు ఉపాధి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పనులను పారదర్శకంగా చేపడుతూ రికార్డులు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్, స్టేట్ రిసోర్స్ పర్సన్ ముజాజ్, ఎంపీడీఓ శ్రీధర్‌బాబు, ఏపీఓ శ్యామల, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల లబ్ధిదారులతో సమావేశం



ఏసీనగర్‌లో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులతో మాట్లాడుతున్న అధికారులు

సీతారామపురం: మండలంలోని ఏసీ నగర్‌లో జగనన్న కాలనీలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులతో ఎంపీడీఓ మంచికంటి రంగసుబ్బరాయుడు, ఈఓపీఆర్డీ భార్గవి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. వారు మాట్లాడుతూ లబ్ధిదారులు త్వరగా ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. సచివాలయాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. సంజీవరెడ్డినగర్‌లో నాడు–నేడు పనులు పరిశీలించి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ చెన్నారాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న లారీ ఇద్దరికి తీవ్రగాయాలు



తీవ్రంగా గాయపడిన బాలుడు ప్రేమ్‌చరణ్

సంగం: ఓ లారీ రివర్స్ చేస్తూ వెనుక వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ముగ్గురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన సంగంలోని కావలి కాలువ వద్ద జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. బుచ్చిరెడ్డిపాళెం నుంచి సంగం వైపు ఆటో ప్రయాణికులతో వస్తుండగా, లారీ రివర్స్ చేసుకుంటూ వచ్చి ఢీకొట్టింది. ఆ సయయంలో ఆటోలో ఉన్న ముగ్గురు మహిళలతో పాటు 14 ఏళ్ల బాలుడు, ఆటో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. డ్రైవర్ శివ, బాలుడు ప్రేమ్‌చరణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. 108 వాహనంలో హుటాహుటిన ఆత్మకూరు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న ఎస్సై నాగార్జునరెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించారు. లారీడ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిల్లలకు కొత్త ఆధార్ కార్డుల నమోదు



ఆధార్ కార్డులను నమోదు చేస్తున్న అధికారులు

అల్లూరు: అల్లూరు–4 సచివాలయంలో ఏర్పాటు చేసిన స్పెషల్ ఆధార్ క్యాంప్‌లో శుక్రవారం దాదాపు 30 మంది డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్లను పొందిన పిల్లలకు ఆధార్ కార్డులను నమోదు చేసినట్లు పంచాయతీ కార్యదర్శి వరప్రసాద్ తెలిపారు. ఆధార్ నమోదు చేసిన పిల్లలకు వారి ఇంటి వద్దకే కొత్త ఆధార్ కార్డులు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్టీసీకి రూ.8.46 లక్షల జాతర ఆదాయం

ఉదయగిరి: దుత్తలూరు మండలం నర్రవాడలో జరిగిన వెంగమాంబ పేరంటాలు మహోత్సవాల సందర్భంగా ఉదయగిరి డిపోకు రూ.8.46 లక్షల ఆదాయం వచ్చినట్లు డిపో మేనేజరు శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 28 బస్సు సర్వీసులు బుధ, గురువారాల్లో పోరుమామిళ్ల, బద్వేలు నుంచి నడిపినట్లుగా ఆయన తెలిపారు.

ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నేడు

కావలి: కావలి ఏరియా ఆస్పత్రిలో రాష్ట్ర ప్రభుత్వం, గ్రేస్ ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించనున్నట్లు డిప్యూటీ డీఎంహెచ్ఓ బ్రిజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు క్యాన్సర్ స్క్రీనింగ్, వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయనున్నట్లు తెలిపారు.

యువతకు క్రికెట్ కిట్ అందజేత

చేజర్ల(సోమశిల): ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అనంతసాగరం మండలం ఆమనిచిరువెళ్ల గ్రామ యువతకు క్రికెట్ కిట్‌ను శుక్రవారం నెల్లూరులోని మేకపాటి కార్యాలయంలో అందజేశారు. గురువారం గడప గడగపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా అనంతసాగరం మండలం ఆమని చిరువెళ్లలో ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పర్యటిస్తున్న సమయంలో తమకు క్రికెట్ కిట్ కావాలని అక్కడ యువత ఆయన్ను కోరారు. క్రీడలంటే తనకు ఇష్టమని, క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో క్రికెట్ క్రీడా సామగ్రిని వారికి అందజేశారు.



క్రికెట్ కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఉపాధ్యాయుడికి సన్మానం



వెంకటేశ్వర్లును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామస్తులు

జలదంకి: మండలంలోని అన్నవరం యూపీ పాఠశాలలో పనిచేసి బదిలీపై కావలికి వెళ్లిన ఉపాధ్యాయుడు బుర్రి వెంకటేశ్వర్లును శుక్రవారం పాఠశాలలో తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాలతో సత్కరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ వెంకటేశ్వర్లు గతంలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా అవార్డు పొందారని, ఈ పాఠశాలలో 10 ఏళ్ల పాటు విధులు నిర్వహించి విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతూ గ్రామస్తుల మన్ననలు పొందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుప్రియదేవి, మోహన్‌రావు, రమణయ్య, సుమతి, చిన్న రాములు, గ్రామస్తులు పాల్గొన్నారు.